


# వీరాస్వామి నాయుడు

శ్రీ లింగరాజు

ఇన్స్పెక్టరు వీరాస్వామినాయుడు పేరు దొంగలకే కాదు అల్లరి చిల్లరివాళ్లకి కూడా సింహస్వప్నమే. పొడగూ చేయెత్తు జమాను. నల్లగా నేరేడు పండు ఛాయతో నిగనిగలాడే ముఖం; దానిమీద తెల్లగా సఫేద్‌లాంటి బుగ్గమీసం, మనిషినిచూస్తే హడలు పుట్టాల్సిందే. నిమ్మకాయ నిలబెట్టే ఆ మీసం మూలాన్నే ఇన్స్పెక్టరు వీరాస్వామి నాయుడుకి మీసాల ఇనస్పెక్టరనే పేరొచ్చింది. తరతరాలుగా వస్తూన్న ఇంటిపేరేమిటో తెలియకుండానే మాసిపోయింది. అసలు నాయుడు కాగితం పనివాడు కాడు. పోలీసుపనికి చదువంతగా అక్కర్లేని రోజుల్లో ఉద్యోగంలో చేరేడు. ధైర్యసాహసాల వల్ల, రాజభక్తి పరాయణత్వం మూలాన్న, అధికారుల ప్రాపకంతోటి బాగా పైకొచ్చాడు. మన్యం ఫితూరీలో మురాదార్లను మూడు చెరువులనీళ్లు తాగించినందుకే అతనికి సర్కిల్ ఇనస్పెక్టరు ఖాయమైంది. రాయబహద్దూర్ బిరుదంకూడా లభించింది ఆనాటిదే మీసాల ఇనస్పెక్టరు బిరుదుకూడాను. అతనికి రాజ్యాంగవిషయాలతో నిమిత్తం లేదు. పోలీసు డిపార్టుమెంటే ఈ రాజ్యాన్ని నిలబెడుతోందన్న దృఢవిశ్వాసంతో ఉద్యోగం చేస్తున్న మనిషి — మాస్తేనే భయం వేస్తాడు. మాట్లాడితే వేరేచెప్ప నక్కరే లేదు.

*    *    *

వీరాస్వామినాయుడు కొక్కతే కూతురు సావిత్రి. చాలా సంతానం నష్టంకాగా మిగిలిన దవడంచేత నాయుడికి సావిత్రమ్మంటే అపరూపం.

ఊరందరినీ బుకాయించే నాయుడు సావిత్రిదగ్గర మాట్లాడడు. ఆమె కొండమీద కోతినడిగితే తెచ్చిఇవ్వవలసిందే. చిన్నప్పటినుంచీ శ్రద్ధగా చదువుచెప్పించాడు

సంగీతం చెప్పించాడు. రోజూ పోలీసుస్టేషనులో అరిచి అరిచి వచ్చిన నాయుడికి ఇంటిదగ్గిర ఆనందం కలిగించేది సావిత్రే.

సావిత్రికి పన్నెండేళ్లుదాటి నప్పటినుంచీ నాయుడికి బెంగ ప్రారంభించింది. పెళ్లికొడుకును వెదకడం పెద్ద పనైంది. ఆస్తి పాస్తి లెట్లాఉన్నా ఉద్యోగస్థుడితో వియ్యం పొందాలని నాయుడి సంకల్పం. సంకల్పమేమిటి శపథం. భూమీ పుట్రా ఉందికదా అని పల్లెటూరి సంబంధం చేస్తే ఉద్యోగఛాయలో పెరిగిన అమ్మాయికి సౌఖ్యం అమరదేమోనని అనుమానం. ఆ ఉద్యోగంలోనూ గెజిటెడ్ ఆఫీసరుతో వియ్యమందాలని సరదా.

వెతికి వెతికి చివరికి రిటైర్డు డిస్ట్రిక్టు మునసబు గోపాలస్వామి నాయుడుగారి కొడుకు రంగనాయకులు నాయుడి కిచ్చి పెళ్లిచేశాడు. రంగనాయకులుకి పిత్రార్జితం, మర్యాదగా కాలక్షేపం చేయడానికి సరిపోతుంది. కొత్తగా బి. యల్. ఫస్టుక్లాసులో ప్యాసై కాకినాడలో బల్లకట్టి పనిగా శ్కేసుతున్నాడు. ఏదో పిల్లవాడు తెలివైనవాడు కదా, అధికారుల నాశ్రయించి, ఏదో ఒక ఉద్యోగం సంపాదించలేక పోతాడా అనే ధీమాతో వీరాస్వామి నాయుడు ఈ సంబంధానికి అంగీకరించాడు. పిల్లవాడు బుద్ధిమంతుడనీ, ఈడూ జోడూ బాగుందనీ సంతోషించాడు నాయుడు.

* * *

అవి సైమన్ కమిషన్ రోజులు. ఎవ్వళ్లో చూచినా అదే గొడవ బహిష్కార ప్రయత్నాలు, నల్లజండాల గంద్రగోళం అన్ని పార్టీలు ఏకమంటే ఏకమన్నారు.

విద్యార్థుల్లోనూ విద్యావంతుల్లోనూ కూడా ఉత్సాహం జోరుగా ఉంది ఆ రోజునే బొంబాయిలో సైమన్ సప్తకం ఓడ దిగేను. దేశమంతా హరతాళం జరిపించమని పెద్దల ఆజ్ఞయింది. ఊళ్లో రావుబహద్దర్లు పందుంప్రయత్నాలు చేస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం 11 గంటలకు కాకినాడ బారు రూములో ప్లీడర్లంతా సమావేశమైనారు. ఆ రోజు కోర్టుకెళ్ళడమా మానడమా అనే విషయంమీద జోరుగా చర్చజరుగుతోంది - కోర్టుమానెయ్య వలసిన ధర్మాన్ని గురించి ఒక పంతులు ధర్మోపన్యాసం చేస్తున్నాడు.

"ఎందుకండి మానెయ్యడం. ఏదైనా ఒడుదుడుకొస్తే మనం ఆపుడమూరాన్నంటాం" అన్నాడు రంగనాయకలు నాయుడు.

"అల్లాంటి పిరికితనం ఎవరికైనా ఉంటే మానకండి. దేశాభ్యుదయంఅంటే ముందంజ వేయవలసిన లాయర్లు ఇల్లాంటివాళ్ల మూలాన్నే ఇంత అధోగతిపాలవుతున్నారు" అన్నాడు ఉపన్యాసకుడు.

"పోలీసు సూపరెంటు సెలెక్షను కెడుతున్నాడు కాదు మరీ" అన్నాడొక బ్రాహ్మణ లాయరు.

"మునసబీకి ప్రయత్నం" అన్నా డింకొకడు.

రంగనాయకులికి పౌరుషం వచ్చింది. "కబుర్లు కాదు. ఏమొచ్చినా చివరదాకా నిలబడే పౌరుషం గలవాళ్లుంటే నేను ముందే వస్తాను. ఇవ్వాళ ఈ లెక్చర్లు కొట్టి రేపు ఏదైనవస్తే చిత్తం మహాప్రభో అని క్షమార్పణ ఇవ్వకూడదు." అన్నాడు.

ఆరోజున కోర్టుకు వెళ్ళని కొద్దిమంది లాయర్లలో రంగనాయకు లొకడు. సాయింకాలం బహిష్కారోత్సవం బయలుదేరింది. గాంధీ టోపీలు బారులు తీరేయి. పైన నల్లజండాలు కారుమబ్బుల్లాగున్నాయి. ఆరోజున చాలా కొత్తమొగాలు కనబడుతున్నాయి. అందులో రంగనాయకులు ముందువరుసలో నిలబడ్డాడు. చేతిలో చిన్న నల్లజండా పుచ్చుకున్నాడు. ముఖంచూస్తేమాత్రం ఏదో తీవ్రమైన ఆలోచనలో వున్నట్లు స్పష్టంగా కనుబడుతోంది. సి. ఐ. డి. పోలీసులు అతనిపేరే ముఖ్యంగా వ్రాసుకున్నారు. ఆరోజు సాయంకాలం అతని ఉపన్యాసమే ఘాటుగా ఉంది.

* * *

మర్నాడు తెల్లవారేసరికి రంగనాయకులింట్లో తుపాను రేగింది. కబురు తెలిసి కాలాంతకుడులాగ ఇనస్పెక్టరు

# ఇనస్పెక్టర్

వీరాస్వామినాయుడు చక్కా వచ్చాడు. ఇక నేమందీ! నాయుడు ఆశలన్నీ విఫలమైపోయాయి. అధికారుల ఆశ్రయింపులు తప్పుదండుగైపోయాయి. ఇవ్వాళో రేపో అసిస్టంటు సూపరెంటు లిష్టులో పడతాననుకునే అల్లుడు పోలీసు నిఘా లిష్టులో పడ్డాడు.



ఇనస్పెక్టరు కోపం ఆగలేదు. సావిత్రమ్మను తిట్టేడు. రంగనాయకులమీద విరుచుకుపడ్డాడు. అసలు నూటికి నూరుపాళ్లు పోలీసు దర్జాగల మనిషి. దానికితోడు ఆవేశం కూడా వస్తే ఇంకా వేరే చెప్పాలా? నాయుడు ఉరుముతున్నకొద్దీ రంగనాయకులు నెమ్మదిగా సమాధానం చెప్పుతున్నాడు — మెల్లగా సమాధానం చెపుతున్నకొద్దీ విజృంభిస్తున్నాడు నాయుడు - ఇద్దరిమధ్యా సావిత్రమ్మకేమీ తోచలేదు. ఏమన్నా నోరు మెదిపితే నాయుడు ఆగ్రహానికి కట్టలు తెగిపోయేటట్లున్నాయి. నెలకి రెండువందలో మూడువందలో నికరంగావచ్చే జీతాన్ని పోగొట్టుకున్నందుకు నాయుడు కోపపడుతుంటే ఆమెకు సబబుగానే కనిపించింది — రంగనాయకులు దేశమంటూ, లోకోపకారమంటూ చెప్పేమాటలూ సబబుగానే కనబడ్డాయి. మొత్తంమీద అల్లుడి మామల తుపానుకు ఊగులాడింది సావిత్రే.

* * *

సైమన్ కమిషన్ వచ్చింది వెళ్లింది. మళ్ళీ వచ్చింది, మళ్ళీ వెళ్ళింది. కాని అల్లుడికీ మామకూ పొత్తు కుదరలేదు. వారానికొకసారైనా అల్లుడినీ కూతురినీ చూస్తూవుండే నాయుడు, నాటికి నేటికి అల్లుడి గుమ్మం తొక్కలేదు. రోజు రోజుకి వాళ్లు దూరమై పోతున్నారు. మామూలు బంధు మర్యాదలు కూడా పోయాయి. ఈ అవస్థ ఇల్లాఉండగా గోరుచుట్టుమీద రోకలిపోటు పడ్డట్టు కలెక్టరు కబురంపేడు.

"ఏమయ్యా, నీ అల్లుడు రంగనాయకులు రాజద్రోహిగా తయారైనాడుట - కాదూ - ఇల్లా ఊరుకుంటావేం" అని అడిగేడు ఇనస్పెక్టరును

"మహాప్రభో అవుతున్నాడండి. నా దౌర్భాగ్యంకొద్దీ నాడు నా కూతురుకు మొగుడైనాడు. ఇప్పుడు నాకు కూడా అయినాడు. ఊరుకోక ఏంచెయ్యను. చిన్నవాడా? చితకు వాడా? అయినా వాడితో సంబంధం వదులుకున్నాను" అని సమాధానం చెప్పుకొని బయటపడేసరికి తల ప్రాణం తోక కొచ్చింది. ఏకాఏకీని సావిత్రమ్మ ఇంటికెళ్లి మళ్ళీ ఒకసారి మంగళాష్టకం పాడి చక్కా వచ్చాడు. ఈ దౌర్భాగ్యపు అల్లుడి మూలాన నా ఉద్యోగం, అంతకన్నా కష్టపడి సంపాదించిన రాయబహద్దూరు కూడా పోతాయేమోనని దిగులు పడుతుంటే సావిత్రమ్మ మనసు చిటుక్కుమంది అటు తండ్రి పోలీసు ఛాయా మనిషి. ఇటు భర్త దేశసేవాపరాయణుడు. ఎవరివాదం వారు సావిత్రిదగ్గర చెప్పుతుంటే ఇద్దరిదీ సబబుగానే కనపడేది.

మొత్తంమీద సైమన్ సప్తకం ఏనాడు కాలెట్టిందో కాని అప్పటినుంచీ సావిత్రమ్మ సంసారంలో శాంతిలేదు. ఇల్లా మాసాలు గడిచేయి.

*   *   *

"ఇక ఆగడానికి వీలులేదు. ఏమైనా సరే. వెల్లిశీరాలి రేపు ఉదయం మొదటి జట్టు పికెటింగు"

"నాన్నగారికి గుండెపగిలి పోతుంది సుమండి"

"పోని ఎంతవుంది తలలు పగలడం లేదు?"

"మీరంతగా తెగిస్తే నేనేనా జంకేది?"

"మరింకేం"

"అవును ..కాని...మీ కోమల శరీరాన్ని ఆ బెత్తాల కప్పచెపుతారా?"

"కోమలాంగులు కూడా అందుకు సందేహించడంలేదు.

"కానియ్యండి, కాని మీరేంచేసినా నేను మీకన్న ముందేస్తుమండి!"

"అంత సాహసించకు మరి కాస్త నిదానించు. చూలింత రాల వాయిరి."

"తరువాత బాలింత నవుతాను."

"నువ్వు ఆగలేవేమో. ఎంతైనా మేము మగవాళ్లం"

"ఎంత మగవాళ్లైనా ఒకమ్మ కడుపు, పుట్టినవాళ్ళే. నొప్పి అందరికీ ఒకట్టే, పైగా ఆడవాళ్లకెక్కువ ఓర్మి ఉంటుంది.

"కానీలే. చర్చ ఎందుకూ? ఆలోచించి నీ ఇష్ట మొచ్చినట్లు చెయ్యి."


*   *   *

కాకినాడలో బట్టల కొట్లదగ్గర పికెటింగు జరిగింది. ఒకప్పుడు జస్టిస్ పార్టీవాడనుకొనే రంగనాయకులు పికెటింగు జట్టుకు నాయకుడు. అతని భార్య బాలింతరాలు కూడ పికెటింగు చేసింది. ఆమెను ముందే అరెస్టుచేశారు. రంగనాయకులు నాయుడికి పల్చపల్చగా జూవ పోశారు. తర్వాత అరెస్టు చేశారు. ఆరోజునే విచారణలు జరిగేయి. రంగనాయకులకు 6 నెలలు కఠిన శిక్ష, సావిత్రికి 3 నెలలు విడిఖైదూ విధించారు - ఈ వార్తలన్నీ సాయంకాలం 5 గంటలయ్యేసరికి పోలీసు స్టేషన్‌లో కూర్చునివున్న ఇనస్పెక్టర్ వీరాస్వామినాయుడు చెవులో పడ్డాయి. పడడం లోనూ గోరంతలు కొండంతలుగా పడ్డాయి అంతకు పూర్వం ఏదో ఆలోచిస్తున్న మనిషి అమాంతంగా లేచి పళ్లు పటపట కొరుకుతూ పచార్లు చేశాడు. పిచ్చిపట్టినట్లు తిరుగాడేడు. ఆరూ మూడూ ఆరుమూడూ అంటూ గొణుక్కున్నాడు గభాలున సైకిలెక్కి ఇంటికెళ్ళేడు. వెంటనే మంచంమీద వాలేడు. మరి గంటసేపయ్యేసరికి మనిషి స్వాధీనం లేదు. 105 డిగ్రీలు జ్వరం. పరాకు మాటలు. మన్యం సర్వీసు బాపతు మలేరియా ఏమోనని వైద్యులు మందులిచ్చి చూచారు సంగతి గ్రహించాక మనోవ్యాధికి మందేమిటని పెదిమెలు చప్పరించారు వైద్యులు. ఆ పడక పడక రోజులు గడిచాయి, వారాలు గడిచాయి నెలలు గడచాయి - మనిషి క్షీణించి శల్యావశిష్టమయ్యేడు. రోజూ మాత్రం చిన్నగొంతుకతో 'సావిత్రీ చిట్టి బాబేడీ' అంటూ ఉండేవాడు. ఒకరోజున వెల్లూరు జైలునుంచి సావిత్రి మగశిశువును ప్రసవించినట్లు తంతి వచ్చింది - చెవిటివానికి చెప్పినట్లు వీరాస్వామి చెవులో శుభవర్తమానం పడేశారు. నాయుడు 'ఆ' ఏడీ చిట్టిబాబెక్కడ అంటూ గభాలున లేచి కూచుని శక్తిలేక వెనక్కి పడిపోయాడు. వచ్చే శనివారం విడుదల చేస్తారనీ సోమవారం ఉదయం మెయిల్లో సావిత్రి రాజమహేంద్రవరం వస్తుందనీ చుట్టూ ఉన్నవాళ్లంతా చెప్పేరు. నాయుడు ఒక్కనవ్వు నవ్వేడు. కన్నీరుధార కట్టింది అప్పటినుంచీ అతనిదృష్టి ఎదుటనున్న క్యాలెండరు మీదే ఉంది. 'చిట్టిబాబు చిట్టిబాబు' అనుకుంటూ ఉండేవాడు నెమ్మదిగా నోట్లో.

*   *   *

సోమవారం తెల్లారింది. వీరాస్వామినాయుడు గడియారంకేసి చూస్తూనే ఉన్నాడు. ఎవరు పలకరించినా మాటాడడం మానేశాడు.

యూనిఫారముతో వచ్చి పోలీసులు సలాములుచేసి పోతున్నారు పండంటి బిడ్డనెత్తుకొని సావిత్రి గుమ్మంలో బండిదిగింది. దిగుతూనే పొత్తిళ్లలో బిడ్డ నుంచుకుని



తిన్నగా తండ్రి మంచందగ్గర నిలబడింది నాయుడు గభాలున అదిరిపడి లేచాడు. ఎక్కడలేని శక్తి వచ్చింది. ఆత్రంగా చేతులుచాచి బిడ్డనందుకుని రొమ్ముకానుకున్నాడు. జలజల కన్నీటిబిందువులు రాలేయి. ఒక్క క్షణంలో సొమ్మసిల్లి వెనక్కి పడ్డాడు కళ్ళు మూసేడు. అంతే ఆ మూసిన కన్ను మరి తెరవలేదు.

* * *

ఎంత ఉద్యోగస్థుడైనా కడుపు తీపి కాదండీ అన్నారు అక్కడున్నవాళ్ళు.

* * *

## "జ్యోతిషము – సాముద్రికము"

వంశ పారంపర్యము వచ్చినవిద్య

జన్మ ఘడియలు (లేక గంటలు) తేదీతోగాని జాతక చక్రము దశాశేషముతోగాని చేతుల గురుతులు గాని పేరునుగాని ఉత్తరము వ్రాయుకాలముగాని పంపించవలెను. క్లుప్తముగా జాతక ఫలములన్నీ రూ. 2-8-0. ఒక దశ ఫలము పూర్తిగా రూ. 2-8-0 సంవత్సర ఫలములు విపులముగా రూ. 2-0-0 (యింకా విశేషములు వ్రాసి తెలిసికొనుడు) చేతులగురుతులకు ఫలములు రూ. 2-0-0 కవచములు, సర్వజయ, ప్రేమజయ, దుష్టగ్రహ నివారణ, సర్వజన వశీకరణ, చోరజయ, ఆరోగ్యకవచము వొక్కొక్కటి రూ. 1-8-0 వ్యాజ్య జయ, పరీక్షజయ, వాణిజ్య జయ, శత్రు జయ, వాగ్జయ, దుష్ట మృగజయ, కవచము లొక్కొక్కటి 1-0-0 (పేరును నెపమును వ్రాయవలెను:

శ్రీ శ్రీస్వామి, హొబాలీ హొబాము

శ్రీకాకుళం (విశాఖపట్నం జిల్లా)